

నకిలీ విత్తనాలతో
నిండా మునిగిన రైతులు

- చేగుంట మండలం రుక్మాపూర్‌లో వంద ఎకరాల్లో వరికి నష్టం
- సీడ్ కంపెనీ మోసంపై పోలీసులకు రైతుల ఫిర్యాదు

5



వందేమాతరం గేయానికి 150 వసంతాలు

వందేమాతరం గేయం150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పాఠశాలలు, ప్రభుత్వ ఆఫీసుల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు సామూహిక ఆలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు మానవహారంగా నిలబడి దేశభక్తిని చాటారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ మాలతి, ఎస్ఐ నారాయణగౌడ్, ఎంపీడీవో దామోదర్, ప్రధానోపాధ్యాయులు దీప్లా రాథోడ్, సాయిరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని వందేమాతరాన్ని ఆలపించారు.

-చిన్నశంకరంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)

రూ. 2 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులు

విడుదల చేయించిన నిర్మల, జగ్గారెడ్డి

రాజంపేట నుంచి ఈద్గా వరకు సీసీ రోడ్డు నిర్మాణం

రాజంపేట ఫిల్టర్‌బెడ్‌లో కంపౌండ్ వాల్, సీసీ, వాచ్‌మెన్ రూమ్, లైటింగ్ ఏర్పాటు.. అతి త్వరలోనే పనుల ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని రాజంపేట ఫిల్టర్‌బెడ్ అభివృద్ధి పనులకు రూ.2 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, తూర్పు జగ్గారెడ్డి విడుదల చేయించారు. ఇటీవల సంగారెడ్డి ఫిల్టర్‌బెడ్ వద్ద జగ్గారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట ఎక్స్‌రోడ్ నుంచి ఫిల్టర్‌బెడ్ మీదుగా ఈద్గా వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయిందని, వర్షాలు వస్తే బురదమయంగా మారి నడవడానికి వీలు లేకుండా మారిందని స్థానికులు జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఫిల్టర్‌బెడ్‌లో వాచ్‌మెన్ రూమ్ లేదని, సీసీరోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని ఫిల్టర్ బెడ్ సిబ్బంది జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ ప్రతిపాదనలపై టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి వినతి మేరకు హెచ్‌ఎండీఏ అధికారులు రూ.2 కోట్ల నిధులు విడుదల చేశారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి.



రాజంపేట ఫిల్టర్‌బెడ్ వద్ద జగ్గారెడ్డి



నర్సాపూర్‌లో కోతులను బెదరగొట్టడానికి గొరిల్లా వేషధారణలో వీధుల్లో తిప్పుతున్న దృశ్యం

కోతులను తరమడానికి గొరిల్లా వేషం

నర్సాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో కోతల బెడద తీవ్రంగా ఉంది. ఇంటి బయట ఉన్న వస్తువులను ఎత్తుకుపోవడమే కాకుండా ఏకంగా ఇంట్లోకి జొరబడి వంట పాత్రలను ఖాళీ చేసినా సందర్భాలూ ఉన్నాయి. ఒంటరిగా కనిపిస్తే మనుషులపైనా దాడి చేస్తున్నాయి. కోతుల బాధ నుంచి రక్షించాలని ప్రజలు పాలకవర్గంతో మొరపెట్టుకుంటున్నారు. దీనికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్ స్పందించి వినూత్న ఆలోచన చేశారు. యూట్యూబ్‌లో వైరల్‌గా మారిన ఓ వీడియోలో కోతులను తరమడానికి మనిషికి గొరిల్లా వేషం వేసి వీధుల్లో తిప్పడం చూసి, నర్సాపూర్‌లోనూ అలా చేయాలని నిర్ణయించారు. ఈమేరకు గొరిల్లా మాస్కు తెప్పించి శుక్రవారం పట్టణంలోని 6, 7 వార్డుల్లో తిప్పించారు. గొరిల్లా వచ్చిందని భయపడి కోతులు పరుగులు తీశాయి. ఇది బాగుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కొనమంటే కొ(ర్రీ)లు

అంచనా కొండంత.. కొన్నది గోరంత

'మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద పది రోజుల నుంచి రైతులు పడిగాపులు పడుతున్నారు. గోనె సంచులు లేవని, హమాలీలు రాలేదని సాకులు చెబుతూ రైతులు తెచ్చిన ధాన్యం పూర్తిగా ఎండినా తూకం వేయడం లేదు. ఎప్పుడు వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.'

'సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ఐకేపీ కేంద్రం ప్రారంభించి 25 రోజులు గడుస్తోంది. తేమశాతం పేరిట తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. వర్షం వస్తే టార్పాలిన్‌లు ఇవ్వడం లేదని, ధాన్యం తడిసి నల్లగా మారుతోందని చెబుతున్నారు. తాను ధాన్యం తెచ్చి 26 రోజులైనా కొనుగోలు చేయలేదని నక్క రాజేందర్ అనే రైతు ఆవేదన చెందాడు.'

'సంగారెడ్డి జిల్లా జోగిపేట మార్కెట్ యార్డు, అందోల్ మండలం అన్నాసాగర్ కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి ముద్దయ్యింది. తూకంలో జాప్యంతోనే వడ్లు తడిసినా.. మళ్లీ ఆరబెట్టి తేమశాతం తగ్గేదాకా కొనుగోలు చేయబోమని చెబుతున్నారని రైతులు వాపోయారు.'

కేంద్రాల్లో సమస్యల తిష్ఠ

వర్షాలకు తడిసిన వడ్లు

తేమశాతం పేరిట ఇబ్బందులు

ధాన్యం కుప్పల వద్దే రైతుల పడిగాపులు

ఆరుగాలం శ్రమించి పండించిన వడ్లను అమ్ముకుందామంటే అన్నదాతకు ఆపసోపాలు తప్పడంలేదు. అకాల వర్షాలకు తోడు కొనుగోలు కేంద్రాల్లో సమస్యలతో బావురుమంటున్నాడు. సెంటర్ల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు పడుతున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి ఉన్నది.



సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అన్నాసాగర్ కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం



నంగునూరు మండలం సిద్దన్నపేటలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

సంగారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు మూడు వారాల క్రితమే ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తెస్తున్నారు. తేమ శాతం పేరిట నిర్వాహకులు కొర్రీలు పెట్టడంతో వడ్లను ఆరబెట్టగా.. ఇటీవల కురిసిన అకాల వర్షాలు ఆగం చేశాయి. కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు ధాన్యాన్ని ఆరబోయడం.. సాయంత్రానికి వర్షం కురిసి తడిసిపోవడం షరామాములుగా మారింది. దీంతో, రోజుల కొద్దీ రైతులు కేంద్రాల్లోనే మగ్గుతున్నారు. ధాన్యం ఎండినా హమాలీలు లేరని, గన్నీ సంచులు రాలేదని

మిగతా 5వ పేజీలో

ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ వివరాలు

జిల్లా	వరిసాగు	ధాన్యం అంచనా	కేంద్రాలు	కొనుగోలు
సంగారెడ్డి	1.40లక్షల ఎకరాలు	3.30లక్షల టన్నులు	207	625 టన్నులు
సిద్దిపేట	3.55లక్షల ఎకరాలు	5లక్షల టన్నులు	420	32,729టన్నులు
మెదక్	2.97లక్షల ఎకరాలు	3.23లక్షల టన్నులు	518	11,144టన్నులు

ఇరవై రోజులు గడుస్తుంది



నేను కుకునూరు కొనుగోలు కేంద్రానికి 20 రోజుల కిందటే వరి ధాన్యం తెచ్చాను. వర్షాలకు మూడుసార్లు ధాన్యం తడిసింది. మళ్లీ తేమశాతం తగ్గేదాకా ఆరబెట్టాను. అయినా కొనుగోలు చేయడం లేదు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు.

-ఎరుకల రాములు, కుకునూరు (వెల్దుర్తి)

కేంద్రాల్లో స్థలమే లేదు



అకాల వర్షాలతో పొలాల్లో పైర్లు కోయడం ఇబ్బందిగా మారింది. కోసిన ధాన్యాన్ని ఆరబెడదామంటే స్థలం లేక రెండ్రోజుల నుంచి మార్కెట్‌లో కుప్పలు పోశాం. సరైన స్థలాలు లేక అవస్థలు పడుతున్నాం. సౌకర్యాలు కూడా సరిగ్గా లేవు.

-లావణ్య, రామాయంపేట



సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో పౌష్టికాహార పంపిణీ (ఫైల్)

డైట్ బిల్లులివ్వరా?

సర్కారు దవాఖానాల్లో నెలల తరబడి విడుదలకాని బిల్లులు

సంగారెడ్డి జీజీహెచ్, టీవీవీపీ ఆస్పత్రుల్లో పేరుకుపోయిన బకాయిలు

పౌష్టికాహార సరఫరాకు అవాంతరాలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్కారు దవాఖానాల్లో రోగులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సరఫరా చేయడానికి అవసరమైన నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నది. బకాయిలు నెలల తరబడి పేరుకుపోతుండటంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ప్రభావం పౌష్టికాహార పంపిణీపై పడుతున్నది.

కాంట్రాక్టర్ల ద్వారా సరఫరా

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు వైద్య విధాన పరిషత్ పరిధిలో పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట ఇలా నాలుగు ఏరియా ఆస్పత్రులు, కోహీర్, కల్హేర్, కరసగుత్తి, సదాశివపేట, మిర్జాపూర్ ఇలా ఐదు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు డైట్ కోసం ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనరల్, జేఎస్ఎస్‌కే నిధులు విడుదల చేస్తూ వస్తున్నాయి. జననీ శిశు సురక్షా కార్యక్రమం (జేఎస్ఎస్‌కే) పేరిట ప్రసవాలకు వచ్చే వారికి అవసరమైన మందులు, ఆహారం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సాధారణ ప్రసవమయ్యే వారికి ఆహారం కోసం రోజుకు రూ.100 చొప్పున మూడు రోజుల పాటు రూ.300 ఒక్కొక్కరికి ఖర్చు చేస్తున్నారు. అలాగే సిజేరియన్ అయిన వారికి ఆహారం కోసం రోజుకు రూ.100 చొప్పున ఏడు రోజుల పాటు రూ.700 వెచ్చిస్తున్నారు. సాధారణ రోగులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.72 చొప్పున ఖర్చు చేస్తున్నారు. సరఫరా బాధ్యతలు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు.

జీజీహెచ్ బకాయిలు రూ.68 లక్షలు

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సంబంధించి డైట్ బిల్లుల బకాయిలు రూ.68,26,008 రావాల్సి ఉన్నదని అధికారులు తెలిపారు. ఇవే కాకుండా జిల్లాలోని టీవీవీపీ పరిధిలోని 9 ఆస్పత్రులకు సంబంధించి రూ.40 లక్షల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని పేర్కొన్నారు.

సర్కారు తీరుపై విమర్శలు

డైట్ బిల్లులు విడుదల చేయక పోవడంపై కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి చెల్లించకపోతే డబ్బులు ఎక్కడి నుంచి తీసుకొచ్చి రోగులకు డైట్ ఇవ్వాలంటూ ప్రశ్నిస్తున్నారు. మెనూ ప్రకారం ఆహారం సరఫరా చేసేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

ఇసుక బజార్‌లో స్టాక్ నిల్..

పది రోజులుగా సరఫరా లేక ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు

నర్సాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇసుక బజార్‌లను ఏర్పాటు చేసింది. మెదక్ జిల్లా పరిధిలో నర్సాపూర్ మార్కెట్ యార్డులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ ప్రారంభించారు. టన్నుకు రూ.1,200 చెల్లించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 1,950 మెట్రిక్ టన్నుల ఇసుకను నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సరఫరా చేశారు. కానీ పది రోజుల నుంచి ఇసుక నిల్వలు ఖాళీ అయ్యాయి. ఇసుక కోసం ఇళ్ల నిర్మాణదారులు ప్రతీరోజు ఇసుక బజార్‌కు వచ్చి రాకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

నెరవేరని లక్ష్యం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆటంకం కలుగకుండా అవసరమైనంత ఇసుకను ఎప్పటికప్పుడు ఇసుక బజార్‌లో అందుబాటులో ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. పది రోజులుగా రీచ్ నుంచి బజార్‌కు ఇసుక రాలేదు. నిర్మాణదారులు పనులను నిలిపేసి ఇసుక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే ప్రైవేటు మార్కెట్‌లో రెట్టింపు ధర చెల్లించాల్సి కొనుగోలు చేయకతప్పడం లేదని నిర్మాణదారులు వాపోతున్నారు. ఇసుక కొరతపై ఇసుక బజార్ ఇన్‌చార్జి ఉన్న రాకేష్‌ను వివరణ కోరగా నల్గొండ జిల్లా నుంచి ఇక్కడి రావాల్సి ఉందని, అనివార్య కారణాల వల్ల కొంత ఆలస్యమైందని తెలిపారు. ఒకటి రెండురోజుల్లో స్టాక్ వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక బజార్‌లో సరిపడా స్టాక్‌ను అందుబాటులో ఉంచకపోతే లక్ష్యం నెరవేరదని, ఇళ్ల నిర్మాణంలో జాప్యం తప్పదని లబ్ధిదారులు వాపోతున్నారు.



స్టాక్ లేక ఖాళీగా ఉన్న నర్సాపూర్‌లోని ఇసుక బజార్

మెదక్ విద్యుత్ సర్కిల్‌కు

రూ. 22 లక్షల నిధులు

మెదక్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెదక్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు సౌతర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముషరాఫ్ ఫారూఖీ రూ.22,15,000లు మంజూరుకు ఉత్తర్వులు విడుదల చేశారు. అధునాతన స్కాడా టెక్నాలజీతో అంత్యంత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కావాల్సిన సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు ఉపకరిస్తాయి. మెదక్ సర్కిల్ పరిధిలో గల ప్రధాన విద్యుత్ ఉపకేంద్రాలకు సరఫరా అయ్యే విద్యుత్‌లో లోపాలను మెరుగుపర్చడానికి నిధులు వినియోగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు.. సరఫరాలో

రెండు రోజులు అంతరాయం

మెదక్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల మార్పు తదితర పనులు చేపట్టడం కోసం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంతో పాటు పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మెదక్ విద్యుత్ శాఖ ఏడీఏ మోహన్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, కాలం చెల్లిన విద్యుత్ తీగల స్థానంలో కొత్తవి బిగించడం, తీగలు, స్తంభాలకు చుట్టుకున్న చెట్లకొమ్మలు తొలగించడం తదితర పనులు చేపడుతున్నామన్నారు. మెదక్ పట్టణంతో పాటు హవేళీఘనపురం, చిన్నశంకరంపేట, పాపన్నపేట, మండలాల్లో ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



మధ్యాహ్న భోజనం వంట పాత్రలు మోస్తున్న విద్యార్థులు

విద్యార్థులతో పనులు..

జహీరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు పట్టాల్సిన చేతులతో.. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులే బరువులెత్తించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెలుగుచూసింది. మధ్యాహ్న భోజనం వండే పాత్రలను వంట చేసే ప్రాంతం నుంచి విద్యార్థులతో మోయించుకుని తీసుకువచ్చి సర్దిపెట్టించారు. ఉపాధ్యాయులే ఈ పనిచేయించగా.. ఇదేమని అడిగితే రోజూ చేసేదేనని కొట్టిపారేశారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారిని వివరణ కోరగా విద్యార్థులతో పనులను చేయించబోమని చెప్పడం గమనార్హం.

అధ్వానంగా పారిశుధ్యం

ప్రధానోపాధ్యాయురాలి సస్పెన్షన్




పాఠశాలను తనిఖీ చేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం పాఠశాలను తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడం, ఎఫ్ఆర్ఎస్ సిస్టం అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం కె.రోజాను సస్పెండ్ చేయాలని, శానిటేషన్ సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల ఆవరణలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


రెడీమిక్స్ వాహనం బోల్తా


పటాన్‌చెరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైవేపై రెడీమిక్స్ వాహనం బోల్తాపడి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి గ్రామం నుంచి కాంక్రీట్ లోడ్‌తో వెళ్తూ పటాన్‌చెరు పాత టోల్‌గేటు నుంచి దాటుతుండగా అదుపుతప్పింది. లోడ్ ఎక్కువవడంతో ఒక్కసారిగా పక్కకు ఒరుగుతూ పడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్స్‌కవేటర్ సహాయంతో వాహనాన్ని మామూలు స్థితికి తెచ్చారు. డ్రైవర్, క్లీనర్‌లు గాయాలయ్యాయి.






























సంగారెడ్డిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆలపిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు, మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సామూహిక వందేమాతరం పాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు, సిద్దిపేట కలెక్టరేట్‌లో ఆలపిస్తున్న ఉద్యోగులు



సామూహిక ఆలాపనలో మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

గొంతులన్నీ ఒక్కటై..
వందేమాతరం ఆలపించి

బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ కూడళ్లలో సామూహిక ఆలాపన కార్యక్రమాలను నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా ఏకస్వరంతో గేయాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని ప్రతిధ్వనింపజేశారు. దేశభక్తిని చాటి, జాతయ సమైక్యతను చాటిచెప్పారు.

-మెదక్ అర్బన్/సిద్దిపేట కల్చరల్/సంగారెడ్డి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేటలో ట్రెస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు

జాతీయ సాహస శిబిరానికి మెదక్ డిగ్రీ విద్యార్థి ఎంపిక



అన్నపూర్ణ

మెదక్ అర్బన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సాహస శిబిరానికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అన్నపూర్ణ ఎంపికైంది. ఈనెల 9 నుంచి 19 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో జరుగనున్న సాహస శిక్షణకు డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థి అన్నపూర్ణ పాల్గొననున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సింహారెడ్డి తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో ఘనపూర్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొగుట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్ గత నెల నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో తొగుట మండలం ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాలకు చెందిన జి.నిహారిక(9వ తరగతి), పి.ప్రణయ్‌రిత్విక్, జి.భవ్యశ్రీ(10 వతరగతి) విద్యార్థులకు రూ.27 వేల నగదు బహుమానం అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, సహకరించిన గైడ్ టీచర్ నవీన్ కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా విద్యాధికారి, ఎంఈవో అభినందించారు.

స్కౌట్స్‌గైడ్స్ జాతీయస్థాయి పోటీలకు నిజాంపేట కేజీబీవీపీ విద్యార్థుల ఎంపిక

రామాయంపేట, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నిజాంపేట కేజీబీవీకి చెందిన 32 మంది విద్యార్థినులు జాతీయస్థాయి స్కౌట్స్ గైడ్స్ పోటీలకు అర్హత సాధించారని పీఈటీ జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 3 వరకు ఉత్తర ప్రదేశ్ లక్నోలో జరిగే నేషనల్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

తూప్రాన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవులు, లేగదూడలు రవాణా చేస్తుండగా వాహన తనిఖీలో పట్టుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. తూప్రాన్ పట్టణ పరిధి నర్సాపూర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహనంలో అక్రమంగా మూడు ఆవులు, రెండు లేగ దూడలు, ఒక దుడ్డె పట్టుబడ్డాయి. వాహనంలో ఇబ్బంది కరంగా కుక్కి రావాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు వాహన డ్రైవర్ నర్సింహ్మారెడ్డి, ఎండీ ఇర్ఫాన్, వాహన యజమాని వినోధ, పశువుల యజమాని మహ్మద్ షఫిలపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కొనమంటే కొర్రీలు

(3వ పేజీ తరువాయి)

తూకం ఆలస్యం చేస్తున్నారు. ఈ సమస్యలన్నింటితో ధాన్యం సేకరణ ఊపందుకోలేదు.

అకాల వర్షాలతో ఆగమాగం

అకాల వర్షాలతో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతిన్నది. కోతలు పూర్తిచేసి కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రాశులు తడిసి ముద్దవుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 40 శాతం కోతలు పూర్తికావడంతో ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు. కానీ, సెంటర్ల వద్ద సరిపడా స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబెడుతున్నారు. ధాన్యం సేకరణ పూర్తి కావడానికి మరో నెలరోజులు పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అప్పటికీ పూర్తికాకుంటే వర్షాల ముప్పు తప్పదు. ధాన్యాన్ని కొనుగోలులో వేగం పెంచకపోతే రైతులు నష్టపోక తప్పదని ఆందోళన వ్యక్తమవుతున్నది.

కేంద్రాల కన్నా మిల్లులు మిన్న

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నది. ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,369 ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెబుతున్నారు. కానీ, ధాన్యాన్ని కొనుగోలు చేయడమే అసలు సమస్యగా మారింది. తేమ, తాలు పేరిట కోతలు, కేంద్రాల్లో వసతులు లేకపోవడం.. ఇలా రకరకాల సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. ఈ ఇబ్బందుల కంటే నేరుగా పొలం నుంచి రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించి విక్రయించడమే సులువైన మార్గంగా రైతులు భావిస్తున్నారు. నేరుగా ధాన్యం తీసుకువస్తే మిల్లర్లు క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.1,900 వరకు చెల్లిస్తున్నారు. క్వింటాలుకు రూ.500 నుంచి రూ.550 నష్టంపోతున్నా కేంద్రాల్లో అగచాట్లను పడలేక రైతులు మిల్లుల వైపే మొగ్గు చూపుతున్నారు.

నకిలీ విత్తనాలతో నిండా మునిగిన రైతులు

- చేగుంట మండలం రుక్మాపూర్‌లో వంద ఎకరాల్లో వరికి నష్టం
- సీడ్ కంపెనీ మోసంపై పోలీసులకు రైతుల ఫిర్యాదు



నష్టపోయిన రుక్మాపూర్ రైతులు

చేగుంట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): విత్తన ఏజెన్సీలు అంటగట్టిన ప్రయోగాత్మక విత్తన రకంతో మెదక్ జిల్లా చేగుంట మండలంలో రైతులు నిండా మునిగారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడి వస్తుందని ఆశించిన అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. బాధిత రైతులు, శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. చేగుంట మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో దాదాపు నలభై మంది రైతులు కలిసి వందకుపైగా ఎకరాల్లో 45,47 (మగరకం) వరి పంటను పండించారు. ఇది ప్రయోగాత్మక, దొడ్డు రకం విత్తనమని కంపెనీ వారు



ఇప్పుడిప్పుడే పిలకలు వస్తున్న వరి పైరు

చెప్పడంతో రైతులు నమ్మి సాగు చేశారు. అయితే, పంట కోత దశకు చేరుకునే సరికి వారి ఆశలు అడియాశలయ్యాయి. పంటకు గట్టిగా ఒక్కటి లేదా రెండు మాత్రమే పిలకలు వచ్చాయి. వరి గింజలు పాలు పోసుకొని గట్టిపడాల్సింది పోయి, మెత్తగానే ఉండిపోయాయి. మరికొన్ని పొలాల్లో పైర్లు మాడిపోయాయి. దిగుబడి మాట దేవుడెరుగు, కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులు ఇప్పటికే ఒక్కో ఎకరానికి సుమారు 20 వేల వరకు ఖర్చు చేశారు. ఈ నకిలీ విత్తనాల కారణంగా రుక్మాపూర్ ఒక్క గ్రామంలోనే రైతాంగానికి సుమారు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. రైతులకు ఈ నకిలీ విత్తనాన్ని నమ్మబలికి, అంటగట్టిన సదరు సీడ్ కంపెనీ సూపర్‌వైజర్ ప్రస్తుతం పత్తా లేకుండా పోయాడు. దీంతో చేసేది లేక, మోసపోయిన రైతులు న్యాయం కోసం అధికారులను, పోలీసులను ఆశ్రయించారు. 'కొత్త రకం సీడ్ అధిక దిగుబడి వస్తుందని, ప్రభుత్వం కంటే క్వింటాకు రూ.200 ధర ఎక్కువ వస్తుందని కంపెనీ సూపర్‌వైజర్ మాటలు నమ్మి సాగు చేస్తే, అందరూ కోతలు కోసి ధాన్యం అమ్ముకుంటే మేము వేసిన నాటుకు ఇప్పుడిప్పుడే పిలకలు వస్తున్నాయి. కంపెనీ సూపర్‌వైజర్ సూచన మేరకు మందు పిచికారి చేస్తే మాడిపోయింది.' అని రుక్మాపూర్‌కు చెందిన రైతులు మ్యాకల శ్రీనివాస్, లక్ష్మి, మాచిన్‌పల్లి గణేష్ వాపోయారు. విత్తన కంపెనీపై కఠిన చర్యలు తీసుకొని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

పత్తి చేను పరిశీలించిన ఏఈవో

- నకిలీ విత్తనాలతో పూత రాలేదని ధ్రువీకరణ.. ఏవోకు ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్దూరులో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతు బెల్లి వెంకటయ్య పత్తి పంటను ఉన్నతాధికారుల సూచనల మేరకు ఏఈవో రాజు పరిశీలించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'నకిలీ పత్తి విత్తనాలతో నట్టేట మునిగిన రైతు' కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏఈవో రాజు రైతుతో కలిసి పత్తి చేనులో తిరిగి మొక్కల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో రాజు మాట్లాడుతూ మద్దూరులోని శ్రీరామ ఫర్టిలైజర్ నిర్వాహకులు సంపత్, రైతు బెల్లి వెంకటయ్య ద్వారా వివరాలు సేకరించినట్లు తెలిపారు. జూన్‌లో సర్కార్, డాక్టర్ చంద్రగోల్డ్, రణధీర్, జీహెచ్‌హెచ్ 020, బిజిక్స్ కంపెనీలకు చెందిన 16 పత్తి ప్యాకెట్లు, 2 కంది ప్యాకెట్లతో పాటు మందులకు అన్నీ కలిపి సుమారు రూ.80వేలకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. పత్తిమొక్కలు ఏపుగా పెరిగాయే తప్ప పూత, ఖాత లేదని ధ్రువీకరించామన్నారు. ఈ విషయమై ఏవో రామకృష్ణకు సమాచారం అందించినట్లు తెలిపారు.



పంటను పరిశీలిస్తున్న ఏఈవో

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. పత్తి ఏరివేతకు కోహెడ మండలం తీగలకుంటపల్లికి కూలీలతో వెళ్లి వస్తున్న ఆటో బోల్తాపడడంతో వృద్ధురాలు మృతిచెందింది. ములుగులో ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోచారం ఔటర్‌రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డుపై బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు.

- ములుగులో లారీ డ్రైవర్ దుర్మరణం
- పోచారం ఔటర్‌సర్వీస్ రోడ్డుపై ప్రమాదంలో యువకుడు
- తీగులకుంటపల్లిలో ఆటో బోల్తాపడి వృద్ధురాలు మృతి
- మరో ఐదుగురికి గాయాలు



హరిసింగ్ (ఫైల్)

ములుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనగా లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లాలోని మండల కేంద్రమైన ములుగులో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బోయిన్‌పల్లికి చెందిన హరిసింగ్(44) లారీ నడుపుతుంటాడు. ఈ నెల 5న చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ నుంచి హైదరాబాద్‌కు ఐరన్ పైపు లోడుతో బయలుదేరాడు. గురువారం అర్ధరాత్రి తరువాత రాజీవ్‌రహదారిపై ములుగు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని హరిసింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హరిసింగ్ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొని యువకుడు

పటాన్‌చెరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని ఔటర్‌రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు మృతిచెంది. సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్ పురపాలక పరిధి చిట్కుల్ గ్రామంలో నివాసం ఉంటున్న భానూరి సురేష్(30) తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఇంద్రేశం గ్రామానికి స్కూటీపై బయలుదేరాడు. మార్గంమధ్యలో పోచారం గ్రామం ఔటర్ సర్వీస్ రోడ్డుపై వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను 108 పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. వైద్యుల సూచనతో గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో సురేష్ మృతిచెందాడు. తల్లి కంసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కట్ల లచ్చవ్వ (ఫైల్)

కుక్కలను అడ్డుతప్పించిపోయి ఆటో బోల్తా

కోహెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న బోల్తా పడడంతో వృద్ధురాలు మృతిచెందగా, మరో ఐదుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధి తీగులకుంటపల్లి గ్రామ క్రాసింగ్ వద్ద చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జేరిపోతుల వెంకట్‌కు చెందిన ఆటోలో ఆరుగురు కూలీలు కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి పత్తి ఏరేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా తీగకుంటపల్లి గ్రామ క్రాసింగ్‌వద్ద ఆటోకు కుక్కలు అడ్డురావడంతో వాటిని తప్పించబోతుండగా ఆటో బోల్తాపడింది. ఈ సంఘటనలో కట్ల లచ్చవ్వ (65) అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఐదుగురు కూలీలతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కరీంగనర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలైన కూలీలను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు యువకుల ఆత్మహత్య

ములుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒకరు అనారోగ్యంతో, మరొకరు అప్పులబాధతో, ఇంకొకరు ఉరేసుకుని బలవన్మరణం చెందారు.



స్వామి(ఫైల్)

పక్షవాతం రావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగు మదిర గ్రామమైన మాసాన్‌పల్లిలో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకరి స్వామి(29) కొంతకాలంగా పక్షవాతం రావడంతో ఇంటికి పరిమితమయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గత నెల 12వ తేదీన అగ్రికల్చర్ యూనివర్సిటీ సమీపంలో పురుగుల మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతిచెందాడు.

గుండ్లమాచునూర్‌లో ఉరేసుకుని ఒకరు

హత్నూర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా గుండ్లమాచునూర్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తమ్మాలి భాస్కర్(38) గ్రామ శివారులోని ఎపిటోరియ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య మంజుల, కుమారుడు, కూతురు ఉన్నారు. గురువారం సాయంత్రం అతడి తమ్ముడి ఇంట్లో చిన్న ఫంక్షన్ ఉండడంతో కుటుంబీకులు, బంధుమిత్రులతో కలిసి భోజనం చేసి, అనంతరం అతడు నివాసముంటున్న ఇంటిలోకి వెళ్లి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో వెళ్లి చూసేసరికి ఇంటిలోని చీరతో ఉరేసుకొని కనిపించాడు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

అప్పుల బాధతో మరొకరు

పటాన్‌చెరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రేశం పురపాలక పరిధి ఐనోలు గ్రామానికి చెందిన ప్రభాకర్(35) కూలి పని చేస్తుంటాడు. గ్రామంలో సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాడు. రెండు లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చే పరిస్థితి కనిపించక మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విశాలాక్షి సమేత విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనోత్సవాల్లో స్వామీజీలు

నారాయణఖేడ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్‌లో విశాలాక్షి సమేత విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, బీచ్కుంద పీఠాధిపతి సోమాలింగశివాచార్య, మల్లన్న గుట్ట పీఠాధిపతి బసవలింగఅవధూతగిరి మహారాజ్, పంచగామ పీఠాధిపతి కాశీనాథ్‌బాబా, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.



మహా పూర్ణాహుతిలో పుష్పగిరి పీఠాధిపతి

అష్టాదశ శక్తిపీఠ ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కొండపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర ఆలయం ఆవరణలో కాలభైరవ వీరభద్ర చండీశ్వర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగద్గురు పుష్పగిరి శంకరాచార్య విద్యాశంకర భారతీ స్వామి, రంగంపేట పీఠాధిపతి మాధవానందసరస్వతి శాస్త్రోక్తంగా క్రతువును నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా వారు భక్తులనుదేశించి అనుగ్రహ భాషణం చేశారు

కనులపండువగా రుక్మిణీపాండురంగ కల్యాణోత్సవం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో శుక్రవారం రుక్మిణీపాండురంగస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ భారతి మహారాజ్ ఆధ్వర్యంలో క్రతువు కొనసాగింది. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కభక్తులకు నిర్వహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అవధూత మహారాజ్, జ్ఞానేశ్వర్ మహారాజ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామాయంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల పరిధి ధర్మారం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం కలగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని రామాయంపేట ట్రాన్స్‌కో ఏడీ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగు మండలాల్లో ..

అల్లాదుర్గం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8, 9 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అల్లాదుర్గం ఇన్‌చార్జి ఏఈ నవాజ్ శుక్రవారం తెలిపారు. అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పెద్దశంకరంపేట తదితర మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని తెలిపారు. విద్యుత్తు తీగలపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా ఇళ్ల నిర్మాణం

చిన్నశంకరంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పారదర్శకంగా సాగుతుందని ఎంపీడీవో దామోదర్ అన్నారు. శుక్రవారం ఆయన పలు గ్రామాలను సందర్శించి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా మూడు వందలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. విడుతలవారీగా బిల్లులు విడుదల చేస్తున్నామని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

చిన్నశంకరంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని తహసీల్దార్ మాలతి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని కామారం, మిర్జాపల్లి తదితర గ్రామాల్లో సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, తూకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేసుకోవాలి

చిన్నశంకరంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండల వ్యాప్తంగా ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న కూలీలు తప్పనిసరిగా జాబ్ కార్డు అప్‌డేట్ కోసం ఈకేవైసీ చేసుకోవాలని ఏపీవో రాజ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీలోగా ఉపాధి హామీ కూలీలు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు.

కల్హేర్ ఎస్ఐగా రవిగౌడ్ బాధ్యతలు



కల్హేర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కల్హేర్ ఎస్ఐగా రవి గౌడ్ నియమితులయ్యారు. సదాశివపేటలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను కల్హేర్‌కు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కల్హేర్‌లో విధులు నిర్వహించిన మధుసూదనరెడ్డి సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఇంతకాలం కల్హేర్ ఇన్‌చార్జి ఎస్ఐగా సిర్గాపూర్ రెండవ ఎస్ఐ నారాయణ కొనసాగారు. ఈ మేరకు శుక్రవారం రవి గౌడ్ బాధ్యతలు స్వీకరించారు.

వెల్లివిరిసిన దేశభక్తి

● ఘనంగా సామూహిక వందేమాతరం ఆలాపన



చౌటకూర్ తహసీల్దారు కార్యాలయం వద్ద వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సామూహిక ఆలాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉదయం 10 గంటలకు ఒకే సమయాన దేశభక్తిని చాటుతూ వందేమాతరం గేయాన్ని ఆలపించారు. వచ్చే సంవత్సరం నవంబర్ 7వ తేదీ వరకు వందేమాతరం గేయ స్మారక ఉత్సవాలు జరుపుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు.



పెద్దశంకరంపేటలో వందేమాతరం గేయాలాపనలో బీజేపీ నాయకులు



రామాయంపేటలో వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు



తూప్రాన్ ఆర్డీవో కార్యాలయం వద్ద ..



చేగుంట పీఎంశ్రీ పాఠశాలలో వందేమాతరం పాడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిర్గాపూర్ కేజీబీవీలో జీఈసీవో బస

● విద్య, భోజనం, పరిశుభ్రత పర్యవేక్షణ



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీఈసీవో

సంగారెడ్డి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లోని కేజీబీవీలో సమగ్ర శిక్ష జెండర్ అండ్ ఈక్విటీ కో-ఆర్డినేటర్(జీఈసీవో)సునీతా ఖన్నా గురువారం రాత్రి బస చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారితో కలిసి నిద్రించారు. అంతకు ముందు బాలికలకు అందిస్తున్న విద్యాబోధనపై ఆరా తీశారు. కేజీబీవీ పరిశుభ్రత, మెనూ ప్రకారం భోజనం, పాటిస్తున్న నాణ్యతను పరిశీలించారు. శుక్రవారం తెల్లవారుజామున విద్యార్థినులతో కలిసి యోగా చేసి, ఓరియంటేషన్ తరగతులు తీసుకున్నారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సంతోషకుమారి ఉన్నారు.

అత్యవసరాల్లో స్కౌట్స్, గైడ్స్ కీలకం

● జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో స్కౌట్స్ గైడ్స్ క్యాడెట్ల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. జాతీయ స్కౌట్స్ గైడ్స్ ఫౌండేషన్ డే పురస్కరించుకుని శుక్రవారం న్యూ బస్టాండ్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని అదనపు కలెక్టర్ నగేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవ గుణం పెంపొందించే ఈ ఉద్యమంలో పిల్లలు చేరేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఎంజేపీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు క్యాంపింగ్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు వేసిన గూడారాలను పరిశీలించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అదనపు ఎస్పీ మహేందర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి, ఎంజేపీ ఆర్సీవో రాజేశం, జిల్లా కమిషనర్ శ్రీజన, జనరల్ సెక్రటరీ రాజేందర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

● మనోహరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మనోహరాబాద్ మండలంలోని ఒక పరిశ్రమలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాలు నిరోధించాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రకాష్, ఐటీసీ పరిశ్రమ ప్రతినిధులు ఆనంద్, ఎస్ఐ సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

పటాన్‌చెరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐడీఏ బొల్లారం పురపాలక పట్టణ పరిధిలోని షిర్డిసాయి భవానీ శంకర ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొలన బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రోజా, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డిలు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



కుక్కల దాడిలో పశువులు మృతి

గుమ్మడిదల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన స్థానిక రైతు సంఘం కుమార్‌కు చెందిన పశువులు వరుసగా కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్నాయి. కొన్ని రోజులుగా వారి పొలానికి వచ్చే ప్రాంతంలో అడవి కుక్కలు తిరుగుతూ ఆవులపై దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. గత వారం రెండు ఆవులు దాడిలో మృతి చెందగా, శుక్రవారం రాత్రి మరోసారి అదే ప్రాంతంలో రెండు దూడలు, ఒక ఆవు కుక్కల దాడికి గురై మృతి చెందాయి. సంఘం కుమార్ కుటుంబం ఈ ఘటనతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నష్టపరిహారం వ్వాలని కోరారు.

కంపెనీలోని సామగ్రి చోరీ

తూప్రాన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఇమాంపూర్ శివారులోని క్లారియన్ బెవరేజెస్ కంపెనీ మూడేళ్లుగా మూతపడి ఉంది. గ్రామానికి చెందిన అల్లాడి రాములు, అల్లాడి నెల్లూరు వాచ్‌మన్‌లుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి కంపెనీ వద్దకు కాపలాకు వెళ్లి పడుకున్నారు. శుక్రవారం ఉదయం చూడగా కంపెనీలో విలువైన కేబుల్ వైర్లు, పంపులు, మోటార్లు, ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ జరిగింది. కంపెనీ మేనేజర్ మధు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పాపన్నపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకొని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మెదక్ వైపు నుంచి పాపన్నపేట వైపు ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా గురువారం రాత్రి సిబ్బందితో కలిసి వెళ్లి కుర్తివాడ గ్రామ శివారులో టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

'సోషలిజమే ప్రత్యామ్నాయం'

కొండాపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళి విముక్తికి సోషలిజమే మార్గమని, ప్రపంచ ప్రజల చూపు ఎర్రజెండా వైపు ఉందని సీపీఎం కార్యవర్గ సభ్యులు అతిమేల మానిక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో 'అక్టోబర్ మహా విప్లవం-సోషలిజం ఆవశ్యకత'పై అవగాహన సమావేశం నిర్వహించారు. దోపిడీ లేని సమాజ నిర్మాణానికి మార్గం చూపి, ప్రపంచంలో మొదటి సోషలిస్టు ప్రభుత్వ స్థాపనకు సోవియట్ రష్యా అక్టోబర్ మహా విప్లవం కారణమైందని గుర్తు చేశారు. సమవేశంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, నాయకులు అశోక్, బాబురావు, ప్రవీణ్, శివకుమార్, ప్రశాంత్, రాజు, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● జూనియర్ సివిల్ జడ్జి హేమలత



మాట్లాడుతున్న జడ్జి

నర్సాపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని, ఆ ఉద్దేశంతోనే న్యాయ సేవ అధికార సంస్థను ఏర్పాటు చేశారని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ న్యాయ సేవల దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడంతో పాటు సత్వర న్యాయం జరిగేందుకు ఈ సంస్థ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏజీపీ సుధాకర్, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ అరుణ, కోర్టు సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, న్యాయవాదులు స్వరూప, మధుశ్రీ, అంజిరెడ్డి, జాఫర్, కాజామోయినోద్దిన్, ప్రకాష్, కె.ఎ.శ్రీనివాస్, ఏ.శ్రీనివాస్, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్

శివ్వంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని గడించవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సాగు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, జిల్లా సహకార కార్యాలయం జూనియర్ ఇన్‌స్పెక్టర్ భరత్ మోహన్, ఏవో లావణ్య, సీఈవో మధు యాదవ్, రైతులు, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇంకా నీటిలోనే పత్తి పంటలు



మర్పల్లి శివారులో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

రేగోడు నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రేగోడు మండలంలో రైతులు అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఈసారి కురిసిన అత్యధిక వర్షాలతో పత్తి పంట నీటి మునిగింది. ఇప్పటికీ నీరు తగ్గకపోవడంతో పత్తి మొత్తం పాడైపోయి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామ శివారులో పత్తి పంట ఇంకా నీరు నిలిచే ఉన్నది. దీంతో పత్తి తీసేందుకు రైతులు నాన్న తంటాలు పడుతున్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని మర్పల్లి రైతు మల్లేశం తెలిపారు.

బడిలో బిహార్ విద్యార్థులకు అడ్మిషన్లు



బిహారి చిన్నారులను పాఠశాలలో చేర్పిస్తున్న ఎంఈవో శంకర్

పుల్‌కల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్.ఇటిక్యాల గ్రామ శివారులో గల ఎంఎస్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న కుటుంబాల పిల్లలను పాఠశాలలో చేర్పించారు. పరిశ్రమలో పనిచేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి 30 కుటుంబాలు వలసలు వచ్చాయి. పరిశ్రమ ఆవరణలో ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలు ఉన్నట్లు ఎంఈవో వి.శంకర్ గుర్తించారు. ఈ మేరకు 30 మంది పిల్లలను ఎస్.ఇటిక్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించారు. వారికి మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అందజేశారు. పరిశ్రమ యాజామన్యంతో చర్చించి బిహారి భాష వచ్చే ఇద్దరు విద్యా వలంటీర్లను నియమించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, సిబ్బంది రవీందర్, వలంటీర్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన

వెల్దుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హస్తాల్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. రెండు రోజుల క్రితం, ఒక రైతు తన ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని కేంద్రం ఇన్‌చార్జి నరేష్‌ను డిమాండ్ చేశాడు. సీరియల్ ప్రకారం కొనుగోలు చేస్తామని నరేష్ చెప్పడంతో ఆగ్రహించిన ఆ రైతు అతనిపై దాడి చేశాడు. దీంతో నరేష్ ఆ రైతుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గత రెండు రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రం మూసివేయడంతో, శుక్రవారం ఉదయం రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన అధికారులు కేంద్రం వద్దకు చేరుకొని కొనుగోలు కేంద్రాన్ని తిరిగి ప్రారంభించారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జడ్పీ సీఈఓ ఎల్లయ్య

బాల్య వివాహాల నేరం

● జెడ్పీ సీఈవో ఎల్లయ్య

చేగుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నేరమని జెడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగ్ మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాల్య వివాహం జరిపించినా లేదా ప్రోత్సహించినా వారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.లక్ష వరకు జరిమానాతో పాటు నాన్ బెయిలబుల్ కేసులు అవుతాయని హెచ్చరించారు. బాల్య వివాహాల నిషేధంపై ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా 16 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రీతి రెడ్డి, తాసిల్దార్ గ్రేసీ బాయి, ఎంఈవో గంగా బాయ్, ఎస్సై సృజన, వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

● కేవీకే శాస్త్రవేత్త రమేష్

జహీరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని డీడీఎస్ కేవీకే శాస్త్రవేత్తలు రమేష్, కైలాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లచ్చునాయక్ తండాలో రైతులకు కందిపంట సాగు, దిగుబడులు తదితరాలపై అవగాహన కల్పించారు. రైతులు మంచి విత్తనాలను ఎంపిక చేసుకుని, అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన తరహాలో పంటలు సాగుచేస్తే ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. కంది పంట పూత దశకు వచ్చిన నేపథ్యంలో రసాయనాలకు స్వస్తి పలికి సేంద్రియ పద్ధతుల్లో తయారీ చేసిన మందులను పిచికారీ చేయాలన్నారు. లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవడం వల్ల క్రిమికీటకాల బారినుంచి పంటలను రక్షించుకోవచ్చని సూచించారు.

కేంద్రం పత్తి దిగుమతి సుంకాలు పెంచాలి

సంగారెడ్డి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతి సుంకాలు పెంచాలని సీపీఎం సీనియర్ నాయకుడు పారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భయపడి ప్రధాని మోదీ పత్తి దిగుమతి సుంకాన్ని 11 శాతం రద్దు చేశారని విమర్శించారు. కేంద్రం అనాలోచిత నిర్ణయం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వినతి

జహీరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించాలని సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్, మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్డీవోను కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు,సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం

మనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనూరులో కులమతాలకు అతీతంగా జరుపుకునేలా యాదుల్లా హుస్సేన్ దర్గా వద్ద జాతర ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చెత్త సేకరణ సమస్యకు పరిష్కారం



నూతన ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో చిన్నారెడ్డి

చేగుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చేగుంట పట్టణ కేంద్రంలో చెత్త సేకరణ సమస్య పరిష్కారానికి మినీ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశామని ఎంపీడీవో చిన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన మినీ ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రశాంత్, ఈవో వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది లింగం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

వెల్దుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై అవగాహన తప్పనిసరి అని ఐసీడీఎస్ సీడీపీవో స్వరూప అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఉమాదేవి, ఆయా శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో సీతారాం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్య, పోలీసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షుద్రపూజలపై అపోహలు వద్దు

పుల్‌కల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజల కలకలం దృష్ట్యా మండల పరిధిలోని ముదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో వి.శంకర్ శుక్రవారం సందర్శించారు. క్షుద్రపూజలపై ఎలాంటి అపోహలకు లోనుకావద్దని ఆయన విద్యార్థులకు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 141 మంది విద్యార్థులకు 104 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వందేమాతర గీతం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గీతాలాపన చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.